సాకారమవుతున్న సొంతింటి కల

- జగనన్న కాలనీల్లో వేగం పుంజుకున్న ఇళ్ల నిర్మాణాలు
- ప్రభుత్వ రాయితీలపై లబ్ధిదారులకు అవగాహన
- నిర్మాణానికి ఉత్సాహంగా ముందుకొస్తున్న వైనం


పాణ్యం జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు

పాణ్యం: నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు కార్యక్రమం ద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోంది. ఇప్పటికే లబ్ధిదారులకు ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి అనుమతులు, అవసరమైన మెటీరియల్‌ను రాయితీపై ప్రభుత్వం అందజేస్తోంది. అంతే కాకుండా కాలనీలో మౌలిక సదుపాయాలైన విద్యుత్, రోడ్లు, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు రెట్టింపు ఉత్సాహంతో నిర్మాణాలు చేపడుతున్నారు.

పూర్తయిన 585 గృహాలు..

మండలంలో 19 పంచాయతీలు ఉండగా జగనన్న కాలనీ, సొంత స్థలాలు కలిపి మండలానికి 1,302 గృహాలు మంజూరు అయ్యాయి. వీటిలో ఇప్పటికే 585 గృహాల నిర్మాణాలు పూర్తి చేయించారు. ఆర్‌సీ -48, ఆర్‌ఎల్-46, ఎల్‌ఎల్-13, బీఎల్-355, బీబీఎల్-251, ఎస్ఎస్-04 చొప్పున నిర్మాణాలు చేపడుతున్నారు. పాణ్యం జగనన్న కాలనీలో కొందరు నిర్మాణాలు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేసి నివాసముంటున్నారు. మరిన్ని నిర్మాణాలు పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు లబ్ధిదారుల్లో అవగాహన కల్పిస్తున్నారు.

రాయితీలతో చేయూత..

గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం గతంలో సిమెంట్, కడ్డీలు మాత్రమే రాయితీపై అందించేది. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు అదనంగా రాయితీలు కల్పించారు. ఒక్కో నిర్మాణానికి రూ.1,80,000లు అందిస్తోంది. ముడిసరుకును ప్రభుత్వం రాయితీలపై అందజేస్తుంది. ఇసుక, సిమెంట్, కడ్డీలు, ఎలక్ట్రికల్, తలుపుల చౌకట్లు, మరుగుదొడ్డి సామగ్రిని అందిస్తున్నారు. అలాగే గృహాలు మొదలు పెట్టుకునేందుకు ముందు పొదుపు సంఘాల ద్వారా రూ.40 వేలు చొప్పున రుణాలు ఇస్తున్నారు. దీంతో లబ్ధిదారులు చకచకా నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నారు.


ఓ ఇంటి వద్ద నిర్మిస్తున్న ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఏఈ అమ్మద్‌బాషా

లబ్ధిదారుల్లో అవగాహన పెంచుతున్నాం

పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై పూర్తిగా తెలియజేస్తున్నాం కాబట్టే నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అంతేకాక నిర్మాణాలు మొదలుపెట్టేందుకు పొదుపు సంఘాల ద్వారా రూ.40వేలు రుణాలు ఇప్పించాం. పాణ్యం జగనన్న కాలనీ మేకలబండను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మాణానికి రూ.6వేలు చొప్పున అందిస్తున్నాం.

– అహ్మద్‌బాషా, హౌసింగ్ ఏఈ

నేడు 'గడప గడపకు మనప్రభుత్వం'

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల సచివాలయం-2 పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సమస్యలతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుకోనున్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జి.సింగవరంలో..

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని జి.సింగవరంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామికి లక్ష పుష్పార్చన


శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామికి పూజ చేస్తున్న దృశ్యం

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్లకు శ్రావణ బహుళ ఏకాదశి పర్వదినమును పురస్కరించుకొని ఆదివారం స్వామి వారికి తిరుమంజనం, పుణ్యావచన, లక్ష పుష్పార్చన కార్యక్రమములు నిర్వహించారు. పూజ కార్యక్రమము ఆలయ అర్చకులు లక్ష్మి కేశవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి, అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలి


బూడిదపాడులో దళిత రక్షణ యాత్రను నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: హక్కుల సాధన, రక్షణకు దళితులు ఐక్యమత్యంగా ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. బూడిదపాడులో ఆదివారం సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళితుల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుని చట్టాలను సక్రమంగా అమలు చేయాలన్నారు. దళితుల సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్న మహా ఉద్యమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల మండల అధ్యక్షుడు భగవంతు, నాయకులు షేషన్న, లోకరాజు, గోరంట్ల, తిమ్మప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'సుంకేసుల'కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొన సాగుతుంది. ఎగువ నుంచి రిజర్వాయర్ కు ఆదివారం 1,394 క్యూసెక్కుల వరద నీటి ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 1,394 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ స్థామర్థ్యం 1.20 టీఎంసీలు ఉందని అధికారులు వివరించారు. దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని బాలుర హైస్కూల్లో సోమవారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 9క్రీడాంశాల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం తైమూర్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వతేదీ అండర్ -14,17 బాలురు, 12వ తేదీ అండర్ -14,17బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బాల్ బాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలను మండల స్థాయిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంల సంతకాల పేపర్లతో హాజరు కావాలని, మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఆడాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

క్రీడా పోటీలు వాయిదా

కర్నూలు (టౌన్) :రాష్ట్ర బంద్ కారణంగా సోమ వారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించాల్సిన కర్నూలు మండల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు వాయిదా వేస్తున్నట్లు కర్నూలు మండల ఎస్‌జీఎఫ్ పోటీల ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన ఈ పోటీలను ఈనెల 12 నుంచి 14 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడా పోటీల్లో పాల్గొనే అండర్-14, అండర్-17 బాల బాలికలు గమనించాలని ఆయన తెలిపారు.

తూనిక యంత్రాలకు సీళ్లు వేయించుకోవాలి

కర్నూలు (న్యూసిటీ) : ఎలక్ట్రికల్ తూనిక యంత్రాలకు వ్యాపారులు తప్పనిసరిగా సీళ్లు వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ తెలిపారు. ఆదివారం కోడుమూరులోని వ్యాపార దుకాణాల్లో ఎలక్ట్రికల్ తూనిక యంత్రాలను పరిశీలించారు. సీళ్లు లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు.

వృత్తి నైపుణ్యాలు అవసరం

కర్నూలు (టౌన్) : వృత్తి పరంగా రాణించాలంటే నైపుణ్యాలు అవసరమని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. ఆదివారం స్థానిక సీతారామనగర్‌లో సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. సర్వీస్ రూల్స్, ప్రజా సంబంధాలు అన్న అంశాలపై శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు.

ఆలయాల నిర్మాణానికి దాతలు సహకరించాలి

ఓర్వకల్లు: గ్రామీణ ప్రాంతాలలో ఆలయాల నిర్మాణానికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని హుసేనాపురం గ్రామ సచివాలయాల ప్రాంగణంలో దాతలు ఇచ్చిన స్థలంలో సత్యనారాయణ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మతో కలిసి భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన ఆలయ నిర్మాణానికి తమ వంతు సాయంగా టీటీడీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మిగతా నిధులను దాతల సహకారంతో సమకూర్చుకొని భక్తులకు సౌకర్యవంతంగా, ఆధునిక పద్ధతిలో నిర్మించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, కాల్వబుగ్గ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, గోపా వెంకటరమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


పూజ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని దంపతులు

పల్లె పాటల్ని కాపాడుకోవాలి


కళాకారుల కళా రూపక ప్రదర్శన


జోగినాయుడును సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్: పల్లె పాటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీవీ సినిమా నటులు, ఏపీ క్రియేటివ్ కల్చరల్ హెడ్ జోగి నాయుడు అన్నారు. సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఆటపాట యాసే తనకు అన్నం పెడుతుందన్నారు. జానపదాల్ని కాపాడుకుంటూ ఎంతో మంది కళాకారులను కలుపుకుంటూ సమాజ చైతన్యం కోసం రంగం ప్రజా సాంస్కృతిక వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అంతకు ముందు కళాకారులు ప్రదర్శించిన కళా రూపాలు అలరించాయి. రంగం రాష్ట్ర అధ్యక్షుడు అనంత కరుణాకర్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, రంగం రాష్ట్ర కార్యదర్శి రాజేష్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రంగం సభ్యులు, కళాక్షేత్రం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులను బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి


- దేశీ శిక్షణ కార్యక్రమంలో బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ వెల్లడి

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణ పరిస్థితులను బట్టి వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ పేర్కొన్నారు. ఆదివారం దేశీ డిప్లోమ కోర్సు కింద 5వ వారం ఇన్‌పుట్ డీలర్లకు కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ... వివిధ వాతావరణ పరిస్థితుల్లో రైతులు పాటించవలసిన పంటల సరళిని వివరించారు. ప్రకృతి వనరులైన నేల,నీరు, పైర్లు, గాలి తదితర వాటిని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవాలని సూచించారు. బెట్ట పరిస్థితులు ఉన్నప్పుడు, అధిక వర్షాలు పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విశ్రాంత జేడీఏ, దేశీ కార్యక్రమ సమన్వయకర్త జయచంద్ర మాట్లాడుతూ..వర్షాలు పడినప్పుడు ప్రతి చుక్క భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగే విధంగా చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంచుకునేందుకు వాటర్‌షెడ్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దేశీ శిక్షణ కార్యక్రమంలో చెప్పే వివిధ అంశాలపై అవగాహన పెంచుకొని రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బనవాసి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

చట్టాలకు చంద్రబాబు అతీతుడు కాదు

- 24 కేసుల్లో బాబు స్టేలు తెచ్చుకున్నారు
- ఆయన అరెస్ట్.. వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు
- స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేష్‌ను కూడా విచారించాలి
- విలేకరుల సమావేశంలో సుభాష్ చంద్రబోస్


మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): చట్టాలకు చంద్రబాబునాయుడు అతీతుడు కాదని, తప్పు చేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభాష్ మాట్లాడుతూ ... కోర్టు స్టేలకు కేరాఫ్‌గా చంద్రబాబు మారారన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ కేసులో రాజకీయ కక్షతోనో, వ్యక్తిగత ద్వేషంతోనో చంద్రబాబును అరెస్ట్ చేయలేదని, చట్టాలు అమలు చేసే ప్రక్రియలో భాగంగానే సీఐడీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారన్నారు. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. వ్యక్తిగత కక్ష, రాజకీయ వైరంతో ఆయనను అరెస్ట్ చేయాలనుకుంటే నాలుగు సంవత్సరాలు ఆగాల్సిన అవసరం లేదన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం వల్లే గతంలో చంద్రబాబు అరెస్ట్ కాలేదన్నారు. చంద్రబాబుపై నమోదైన కేసులను విచారిస్తే ఆయన జీవిత కాలం జైల్లో గడపాల్సిందేనన్నారు. అయితే, బాబు 24 కేసుల్లో అరెస్ట్ కాకుండా, ఎలాంటి విచారణ జరగకుండా హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకున్నారని, అలాంటి వ్యక్తి ఎలా నీతిమంతుడు అవుతాడని ప్రశ్నించారు. బాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలతో నిండి ఉంటే, ఆయన పరిపాలన అంతా అవినీతి, అణచివేతలతో కూడుకున్నదన్నారు. ఆయన అరెస్ట్‌ను రాష్ట్ర ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేష్‌తో పాటు ఇంకా మరికొంత మంది తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుల పాత్ర ఉందని, విచారించి చర్యలు తీసుకోవాలని ఆయన సీఐడీ అధికారులను కోరారు.

వేతనాలు చెల్లించాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి వేతనాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీని అమలు చేయాలన్నారు. స్కూళ్లలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలన్నారు. కేజీబీవీల్లో పని చేస్తున్న వారికి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్దన్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- జి. సింగవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైనవారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. ఆదివారం కర్నూలు మండలం జి సింగవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవిరెడ్డి, ఆదాం పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గోపాల సింగవరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, మంచినీటి సమస్యను తీర్చాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

అర్హులను గుర్తించి పథకాలు

ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరి జోన్, మౌలాలి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, సంపత్‌కుమార్, మద్దిలేటి, మధు, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవిరెడ్డి, ఆదాం, కర్నూలు ఎంపీడీఓ అజాం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిజియోథెరపీ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలోని దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటనలో సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగుల అవయవాలకు వైద్యుడు వీరేష్ నిర్వహించే ఫిజియోథెరపీ సద్వినియోగం చేసుకోవాన్నారు. దివ్యాంగులను కుటుంబ సభ్యులు భవిత కేంద్రానికి తీసుకొచ్చి ఫిజియోథెరపీ చేయించుకోవాని సూచించారు.

సుంకేసుల, తిమ్మనదొడ్డి రూట్‌లో బస్సుల పునరుద్ధరణ

కర్నూలు(అర్బన్): కొంత కాలంగా నిలిపివేసిన సుంకేసుల, తిమ్మనదొడ్డి రూట్‌లో తిరిగే బస్సులను ఈ నెల 11వ తేది నుంచి పునరుద్ధరిస్తున్నట్లు కర్నూలు 2వ డిపో మేనేజర్ సర్దార్‌హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోడ్డు సరిగా లేని కారణంగా ఈ రూట్‌లో బస్సులను నిలిపివేయడం జరిగిందని, అయితే ఈ రూట్‌లోని గ్రామాలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికుల ఇబ్బందులను కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆయన సూచన మేరకు కర్నూలు, సుంకేసుల, కొత్తకోట, ముడుమాల, రంగాపురం, గుండ్రేవుల మీదుగా తిమ్మనదొడ్డికి బస్సులను పునరుద్ధరిస్తున్నామన్నారు. అలాగే సుంకేసుల, కొత్తకోట, గుండ్రేవుల మీదుగా సీ బెళగల్‌కు విద్యార్థి బస్సును కూడా పునరుద్ధరిస్తున్నట్లు డీఎం తెలిపారు.

కరాటే శిక్షణతో ఆత్మరక్షణ

కర్నూలు(సెంట్రల్): అమ్మాయిలు ఆత్మ రక్షణకు కరాటేలో శిక్షణ తీసుకోవాలని కల్లూరు తహసీల్దార్ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో జొహారపురం షడ్రక్ ఏరియాలో మాస్టర్లు టి.శ్రీనివాసులు, సుధాకర్‌లతో కరాటే శిక్షణ పొందిన క్రీడాకారులను బెల్టులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కల్లూరు తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు.

ధర్మ జీవనమే 'ఉపనిషత్తుల పరమార్థం'


మేడూరి దీక్షితులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు


సన్మాన గ్రహీతలతో సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: ధర్మ జీవనమే ఉపనిషత్తుల పరమార్థమని హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప అన్నారు. ఆదివారం సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆచార్య మేడూరి దీక్షితుల వేంకట సుబ్బయ్య 113వ జయంతి ఉత్సవాన్ని మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఆయన 'ఉపనిషత్తుల పరమార్థం'అనే అంశంపై ఉపన్యసించారు. వేదాలు సర్వ విజ్ఞాన నిధులన్నారు. ఉపనిషత్తులు జీవకోటికి ధర్మాన్ని ఉపదేశిస్తాయన్నారు. ప్రపంచంలో మారనిది ధర్మమేనన్నారు. ధర్మాన్ని అనుసరించి జీవించడమే భారతీయ సంప్రదాయమని, సంస్కారమని చెప్పారు. వేదాలు మత గ్రంథాలు కాదని అవి ధర్మ ప్రచార సాధనాలన్నారు. సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ మేడూరి దీక్షితుల వెంకటసుబ్బయ్య ఉస్మానియా కళాశాలలో పని చేస్తూ సాహితీ సదస్సు సంస్థను స్థాపించారన్నారు. సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, కేవీఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పార్వతీదేవి మాట్లాడారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ ఇంద్రావతి, సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల ఆంగ్ల, తెలుగు అధ్యాపకులు డాక్టర్ అక్తర్‌బాను, డాక్టర్ ఫామిదా బేగం, ఉస్మానియా కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్, గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పౌర శాస్త్రం అధ్యాపకులు డాక్టర్ చంద్రశేఖర్‌లను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు మేడూరి దీక్షితులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరసం అధ్యక్షులు సుబ్బలక్ష్మి, కవులు, రచయితలు డాక్టర్ వి.పోతన్న, డాక్టర్ ఆదవాని హనుమంతప్ప, ఎలమర్తి రమణయ్య, హరిశ్చంద్రారెడ్డి, లక్ష్మయ్య, రాజారెడ్డి, మన్సూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యలో నైపుణ్యం సంపాదిస్తేనే రాణింపు



మాట్లాడుతున్న ఈఎస్ చక్రవర్తి

కర్నూలు సిటీ: విద్యలో నైపుణ్యం సంపాదిస్తేనే జీవితంలో రాణించగలుగుతారని రవీంద్ర విద్యా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం జి.పుల్లయ్య, రవీంద్ర మహిళ ఇంజినీరింగ్ కాలేజీలు సంయుక్తంగా నిర్వహించిన ఓరియేంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు, రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం. మోహన్‌కుమార్, ఆ కాలేజీల అడ్వైజర్ డా.ఇ.ఎస్. చక్రవర్తి పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు నిత్య పరిశోధకులుగా ఉంటూ పరిశోధన పత్రాలు ప్రచురించగలగాలన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అనేది పుస్తకాల నుంచి వచ్చేది కాదన్నారు. తాము కాలేజీలు స్థాపించినప్పటి నుంచి నేటి వరకు అనేక అంశాలను విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నామని చైర్మన్ జి.వి.ఎం మోహన్‌కుమార్ అన్నారు. జి.పుల్లయ్య, రవీంద్ర మహిళ ఇంజనీరింగ్ కాలేజీలకు ప్రభుత్వం అటానమస్ గుర్తింపు ఇచ్చిందన్నారు. అనంతరం కాలేజీల సీఈఓ డా.మమతా మోహన్ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3, ఆదిత్య ఎల్ వన్ వంటి ఉపగ్రహాలను ప్రయోగిస్తే మనం చూస్తు చప్పట్లు కొట్టడం కాదని, మనం కూడా అలాంటి పరిశోధనలు చేసి వాటి ఫలితాలు మానవాళికి అందించగలగాలి అన్నారు. కార్యక్రమంలో ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ డా.శ్రీనివాసరావు, కెఈ శ్రీనివాసమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి సహకారం

కర్నూలు (టౌన్): క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులకు తన వంతు సహకారం అందిస్తానని గాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్‌లోని శ్రీలక్ష్మీ నరసింహలక్ష్మీ కళ్యాణ మండపంలో తైక్వాండో సాధన చేస్తున్న క్రీడాకారులకు క్రీడా దుస్తులు, తైక్వాండో శిక్షకులకు ట్రాక్ షూలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి చదువులో రాణించాలంటే క్రీడల్లో సాధన చేయాలన్నారు. క్రీడల వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాలకు, సెల్‌ఫోన్లకు పరిమితం కాకుడదన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

గూడూరు రూరల్: కె.నాగలాపురంలోని గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయం ఎదుట భక్తుల సౌకర్యార్థం చేపట్టిన సీసీ రోడ్డు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మూడు రోజుల కిందట రోడ్డు నిర్మాణానికి గుడి చైర్మన్ చేతుల మీదుగా ఆలయ అధికారులు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంజూరైన రూ. 14 లక్షలతో సాయి కన్‌స్ట్రక్షన్ సంస్థ కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ప్రస్తుతం జేసీబీ యంత్రాల సహాయంతో మట్టి తీత పనులు జరుగుతున్నాయి. ఈ నెల చివరి లోపు సీసీ రోడ్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ రాధాకృష్ణ తెలిపారు.